# సేంద్రియ సాగు.. ఫలితాలు బాగు

- సేంద్రియ వ్యవసాయంతో సత్ఫలితాలు
- అంతర పంటలతో అధిక లాభాలు
- ఎరువులు, గోఆధారిత ఎరువులతో పంటలకు రక్ష
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): లాభసాటి వ్యవసాయానికి, అధిక దిగుబడులు పొందడానికి వ్యవసాయ సుస్థిరత ఎంతో ముఖ్యమైంది. ఆహారభద్రతకు, పౌష్టికాహార ఉత్పత్తికి, సహజవనరులు, పరిసరాల పరిరక్షణకు తోడ్పడుతుంది. సేంద్రియ వ్యవసాయంతోనే ఇది సాధ్యమవుతుంది. వ్యవసాయంలో సుస్థిరత తేవాలంటే రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి. ఇటీవల కాలంలో సేంద్రియ వ్యవసాయంపై ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సుస్థిరత తీసుకురాడానికి కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు.

### యాజమాన్య పద్ధతులు

➡ పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలి. అనువైన అంతర పంటలు వేయాలి. పచ్చిరొట్ట పైర్లకు, పచ్చి ఆకు రొట్టకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఉపయోగించాలి.

➡ పూర్తిగా కుళ్లిన సేంద్రియ ఎరువుల వాడకం, పరిశుభ్రమైన సాగు, సకాలంలో కలుపు నివారణ జరగాలి. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు విరివిగా వినియోగించడం ముఖ్యం.

➡ సాగునీరు సద్వినియోగం, యాజమాన్యంపై దృష్టి పెట్టాలి. రసాయనాలు వాడకుండా సహజ వనరుల ద్వారా భూసారాన్ని పెంపొందించడం, సహజ సస్యరక్షణ యాజమాన్యం చేపట్టడం, జీవన నియంత్రణ పద్ధతులు, వృక్షసంబంధ మందులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

### అంతరపంటలతో అధిక లాభాలు

సాధారణంగా రైతులు ఒక సీజన్‌లో ఒకే పంటను సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల బెడద వల్ల పంట దెబ్బతింటే రైతులు ఆర్థికంగా నష్టపోతారు. సరైన ప్రణాళికతో అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి సాగు చేయవచ్చు. రెండుగాని అంతకన్నా ఎక్కువ పంటలను ఒక నిర్దిష్టమైన నిష్పత్తిలో సాగు చేస్తే వాటిని అంతర పంటలు అంటారు. అంతర పంటల క్రమంలో ఒకటి ప్రధాన పంట, రెండోది అంతర పంట అయి ఉండాలి.

### అనువైన అంతర పంటలు

నేల నుంచి పోషక పదార్థాలు, నీరు గ్రహించే లోతులో వ్యత్యాసాలు ఉండే వేర్ల నిర్మాణం కలిగిన పంటలను అంతర పంటలుగా ఎన్నుకోవాలి. ఒక పంట ఇంకో పంట దిగుబడిని పెంపొందించే విధంగా ఉండాలి. పోషక పదార్థాలు, నీరు, వెలుతురు విషయంలో పంటల మధ్య పోటీ ఉండరాదు. వేర్వేరు కాలపరిమితుల్లో ఉన్న పంటలు, పుష్పజాతి పంటలను కలపడం వల్ల పోషక పదార్థాల ఆవశ్యకత, తేడాలతో కీలక దశల్లో పోటీ ఉండకుండా ఆరోగ్యంగా పెరుగుతాయి. ఒక పంటను రెండో పంటగా పెరగడానికి ఆధారంగా పెంచవచ్చు. ఉద్యాన పంటల్లో తొలుత నాలుగైదేళ్ల వరకు చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో వివిధ పంటలు పండించవచ్చు. పంటల పెరుగుదలకు సంబంధించి పొడవు, పొట్టి వ్యత్యాసాలను బట్టి రెండు అంతకంటే ఎక్కువ పంటలను వివిధ అంతస్తుల్లో పండించవచ్చు. ఒక పంటపై ఆశ్రయించే పురుగుల నిర్మూలనకు మరో పంటపై ఆ పురుగుల నుతినే సహజ శత్రువులను పెంపొందించడానికి కూడా అంతరపంటలు అవసరం. ప్రధాన పంటను ఆశించే పురుగులను అంతర పంటపై ఆకర్షింపజేసి చీడ పీడల బారి నుంచి ప్రధాన పంటను రక్షించుకోవచ్చు.

### సేంద్రియ వ్యవసాయం.. ఉపయోగాలు

➡ ఆరోగ్యానికి పరిసరాల మిత్రత్వానికి, కాలుష్య నివారణకు దోహదపడుతుంది. జీవ వైవిద్యానికి నాంది పలుకుతూ జన్యు వైవిద్యం ఏర్పడుతుంది.

➡ సహజ వనరులు రాబోయే తరాల వారికి కూడా అందుబాటులో ఉంటాయి. నేల, మొక్కలు, జంతువులు ఒకదానికొకటి పరిసరాలకు అనుగుణంగా ఉంటాయి. నేల గుల్లబారుతుంది. మురుగు నీరు పోయే సౌకర్యం పెరుగుతుంది. నేలలో తేమ, గాలి, మొక్క సంబంధాల్లో అనుకూలత ఏర్పడుతుంది.

➡ నీరు పట్టి ఉంచుకునే శక్తి పెరుగుతుంది. వేర్లు బాగా భూమిలోకి చొచ్చుకెళ్లే లక్షణం కలిగి ఉంటుంది. భౌతిక లక్షణాలు వృద్ధి చెందుతాయి. మొక్కకు పోషకాలు బాగా అందుబాటులోకి వస్తాయి. నేలకు వాటిని పట్టి ఉంచుకునే గుణం పెరుగుతుంది. వ్యవసాయ సుస్థిరత పెరుగుతుంది. సురక్షిత ఆహారం లభిస్తుంది.

➡ ఆహారంలోకి విషపదార్థాలు ప్రవేశించే అవకాశం ఉండదు. ఖరీదైన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు. నేల ఉత్పాదకత, భూసారం నిలకడగా ఉంటాయి. పంటలో నాణ్యత పెరుగుతుంది.

➡ నేల, నీరు వ్యవసాయ ఉత్పత్తులు కాలుష్యానికి గురికావు. సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం వల్ల మొక్కకు అవసరమైన ఉప సూక్ష్మపోషకాలు తగుమోతాదుల్లో లభ్యమవుతాయి. చీడ పీడల తాకిడి తగ్గుతుంది.

## సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం ఇన్‌ఫ్లో పెరిగినట్లు డ్యాం జేఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌కు నీటిరాక పెరిగిందన్నారు. 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక గేటును తెరిచి దిగువకు 4,311 క్యూసెక్కులను వదులుతున్నామన్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 1.200 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.026 టీఎంసీ నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: ఆగివున్న లారీని కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం పాణ్యం మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద చోటుచేసుకుంది. హైవే సిబ్బంది వివరాల మేరకు.. నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు జంబులాపరమేశ్వరి ఆలయ వద్ద రోడ్డుపక్కన ఆగివున్న లారీని ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు కారును పక్కకు తీసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

## చెరువులో పూడికతీత పనులకు వినతి

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు చెరువులో పూడికతీత పనులు చేయాలని గ్రామస్తులు, రైతులు శుక్రవారం మైనర్ ఇరిగేషన్ డీఈ భాస్కర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువు కట్టపై కంపచెట్లు పెరిగిపోయాయని.. తూము లీకేజీ అవుతుందోని పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. చెరువు కట్ట కింద సుమారు 500 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. కంపచెట్లను తొలగించి పూడికతీత పనులు చేయాలని కోరారు.

## క్లుప్తంగా

### పాఠశాలలో డిప్యూటీ డీఈఓ తనిఖీలు



పాణ్యం మెయిన్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మహబూబ్‌బేగ్

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్ అన్నారు. శుక్రవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. వాటిని ఆయా పాఠశాలలకు సరఫరా చేయించారు. పుస్తకాల కొరత లేకుండా ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పాణ్యం మెయిన్ పాఠశాలలో తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, డిజిటల్ క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులు రుచికరమైన భోజనం వడ్డించాలని సూచించారు. వంట గదిలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ సుబ్రమణ్యం, పాణ్యం హెచ్‌ఎం మేరీ సునీతా ఉన్నారు.

### ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ వంశీమోహన్

సి.బెళగల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న 127 సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 61 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. శుక్రవారం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 57 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. నలుగురు గైర్హాజరైనట్లు వెల్లడించారు. మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

### కోడుమూరులో భారీ వర్షం



మునిమందలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కోడుమూరు రూరల్: కోడుమూరులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరపి లేని వర్షం కురవడంతో కోడుమూరులోని మెయిన్‌బజార్, తేరుబజార్, మునిమంద ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### సర్పంచ్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓకు అందజేస్తున్న నాగేశ్వరమ్మ

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామ సర్పంచ్ పదవికి నాగేశ్వరమ్మ శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ మల్లీశ్వరికి అందజేశారు. ఇక్కడ సర్పంచ్‌గా ఉన్న అనూష ఐదు నెలల క్రితం ఉద్యోగరీత్యా స్వచ్ఛందంగా రాజీనామా చేసిన విషయం విధితమే. దీంతో ఉపసర్పంచ్‌గా ఉన్న నాగేశ్వరమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల సర్పంచ్ పదవితో పాటు, 2వ వార్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రాజీనామాను ఎంపీడీఓ ఆమోదించినట్లు చెప్పారు. తనకు సహకరించిన అధికారులు, వార్డు సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

### రేపటి నుంచి ఒలింపిక్ డే రన్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 16 నుంచి 20 వ తేదీ వరకు ప్రపంచ ఒలింపిక్ డేను పురస్కరించుకొని 16 క్రీడాంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కేఈ జగదీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 వ తేదీన తైక్వాండో, స్విమ్మింగ్ 18 వ తేదీ యోగ, హాకీ, ఉషు, కరాటే, చెస్ 19 వ తేదీ వాలీబాల్, టెన్నికాయిట్, సెపక్‌తక్రా, షూటింగ్‌బాల్, కబడ్డీ, క్యారెమ్ 20 వ తేదీ సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీరు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈఓఆర్డీ రవికిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

గూడూరు రూరల్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు శుక్రవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలు, వసతులు, విద్యాసామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

### విద్యార్థి కిట్లు పంపిణీ

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ సాహెరాబీ, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

## గోవుల విక్రయాలు జరిపితే చర్యలు



గూడూరు పశువుల సంతను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

గూడూరు రూరల్: బక్రీద్ పండుగ నేపథ్యంలో వ్యాపారులు, రైతులు గోవుల క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హనుమంతయ్య హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని పశువుల సంత మార్కెట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవధపై నిషేధం ఉందని.. గోవులను విక్రయించినా, కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇప్పటికే వ్యాపారులకు నోటీసులు అందజేశామన్నారు. గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిఘా ఉంచామని తెలిపారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా అందరూ సహకరించాలని కోరారు.

## ప్లానింగ్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు ప్లానింగ్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో సెలవుల్లో ఉన్న కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శుల స్థానంలో పలువురికి అదనపు బాధ్యతలు కేటాయించారు. 24, 25 సచివాలయాలకు బోయ తలారి రవికుమార్, 86 వ సచివాలయానికి కె. ప్రశాంత్, 113 సచివాలయానికి నిఖిల్, 94 వ సచివాలయానికి రఘునాథ్‌రెడ్డి, 57 వ సచివాలయానికి బి. సత్య స్వర్ణలతకు బాధ్యతలు అప్పగించారు. పరిపాలన పరమైన ఇబ్బందులు రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వెంటనే బాధ్యతలు తీసుకోవాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వర్షం పడితే రోడ్లన్నీ మడుగులే!



బాలాజీనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు, వెంకటరమణ కాలనీ విశాల్ మార్ట్ ఎదురుగా..



కిసాన్‌ఘాట్ రోడ్డులో..

కర్నూలు (న్యూటౌన్): వర్షం పడితే చాలు కర్నూలు నగరంలోని రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కర్నూలు నగర శివారులోని బాలాజీనగర్, వెంకరమణ కాలనీ మెయిన్‌రోడ్డు, కిసాన్ ఘాట్ రోడ్డులో సమస్య తీవ్రంగా ఉంది. పక్కనే హంద్రీనది ఉన్నా ఆ నీటిని నదిలోకి మళ్లించకపోవడంతో వాహనదారులు బురదనీటిలో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై నిలుస్తున్న నీటిని కాల్వల్లోకి మళ్లించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

సి.బెళగల్: బక్రీద్ పండుగను ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. పండుగ నిర్వహణపై సూచనలు చేశారు. సమావేశంలో మత పెద్దలు ఎస్‌ఎం బాషా, ఘుకూర్, చిన్న అక్బర్, దౌల తదితరులు పాల్గొన్నారు.

### మత పెద్దలు సహకరించాలి



హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ

గూడూరు రూరల్: బక్రీద్ పండుగ సజావుగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ అన్నారు. గూడూరు పోలీసు స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం మత పెద్దలతో శుక్రవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న బక్రీద్ పంగుగ ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు దారి తీయకుండా ఐక్యమత్యంగా మెలగాలని సూచించారు. ఎస్‌ఐ హనుమంతయ్య, ముస్లిం మతపెద్దలు అబ్దుల్‌ఖాద్రి, ఖాజా హొస్సేన్, యూసుఫ్ మియ్యా, మిన్నెల్ల, వాహిద్, హిందూ మత పెద్దలు పరశురాముడు, రామాంజనేయులు, భాస్కర్‌గౌడ్, రుద్ర, గిడ్డయ్య పాల్గొన్నారు.

### రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కర్నూలు(సెంట్రల్) : అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ నాయకుడు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ..సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ..రక్తదానం చేయడంలో ఎంతో సేవ ఉందన్నారు. పశ్చిమ బెంగాల్లో మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటాల్లో వేలాదిమంది కార్యకర్తలు రక్తదానం చేసి నిరసన తెలిపారన్నారు..

### యువతకు స్ఫూర్తి చేగువేరా



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ప్రపంచంలోని యువతీ, యువకులకు చేగువేరా స్ఫూర్తి అని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ అన్నారు. శుక్రవారం చేగువేరా జయంతిని పురస్కరించుకొని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా చేగువేరా పోరాడారన్నారు. పేదలకు అండగా నిలబడారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆదర్శ భావాలను ఒంట బట్టించుకొని సొంత ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్‌బాషా, విజయ్, వెంకటరాముడు, అబ్దుల్లా, బజారి, రఫీ పాల్గొన్నారు.

## జనారణ్యంలోకి జింక



కోడుమూరు లక్ష్మీనగర్‌లో సంచరిస్తున్న జింక,ఊరిబయటకు తరిమేందుకు యత్నిస్తున్న యువకుడు

కోడుమూరు రూరల్: మంద నుంచి విడిపోయిన ఓ మగ జింక శుక్రవారం కోడుమూరు పట్టణంలోని లక్ష్మీనగర్, వెంకటేశ్వర్ నగర్‌లలో నాలుగైదు గంటల పాటు హల్‌చల్ చేసింది. ఇళ్ల మధ్య ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతూ అటు ఇటూ పరుగెత్తసాగింది. కుక్కలు దాని వెంట పడ్డాయి. కొందరు యువకులు గంటకుపైగా శ్రమించి పట్టణంలోని కొండవైపు తరిమేయడంతో జింక అటుగా వెళ్లిపోయింది.

## 90 శాతం రాయితీతో విత్తనాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉండడంతో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, ఉల్లి, పత్తి, మిరప, కంది, వేరుశనగ, ఆముదం, కొర్రలు, తదితర పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. ఈ నెల 19వ తేదీ స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, నాయకులు చంద్రబాబు, మధుసూదన్, వెంకటేశ్వర్లు, సుధాకర్,సూర్యనారాయణ,నాగరాజు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్

ఓర్వకల్లు: ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో 'ప్లాంట్ ఏ ట్రీ ఛాలెంజ్-వర్షాకాలం వచ్చింది.. మొక్కలు నాటుదాం!' అనే అంశంపై ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 10 వేల మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా మండలంలోని అన్ని పాఠశాలలు, కమ్యూనిటీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా, ఇంటి పెరట్లలో మొక్కలు నాటుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అవసరమైన చోట్ల మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్వామా ఏపీడీ లక్ష్మన్న, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ఏపీఓ కుమార్‌సాయినాథ్ పాల్గొన్నారు.

## మలేరియాపై అప్రమత్తత అవసరం

గూడూరు రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిణి ప్రత్యూష అన్నారు. గూడూరు పీహెచ్‌సీలో మలేరియా మాసోత్సవాలపై శుక్రవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలకు మలేరియాపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి బారినపడితే తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి తెలియజేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని తెలిపారు.